సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శంషాబాద్: మరమ్మతుల కారణంగా శంషాబాద్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆర్‌బీనగర్, ఆదర్శనగర్, రాళ్లగూడ, నక్షత్రా విలా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భవానీ ఫీడర్‌లో..

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి భవానీ ఫీడర్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా భవానీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కోత ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉప్పర్‌పల్లి గ్రామం, ఫోర్ట్‌వ్యూ కాలనీ, పరమారెడ్డిహిల్స్, గోల్డెన్ హైట్స్, జన చైతన్య ఫేస్-1, 2, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, సన్ రైజ్ హోమ్స్, చింతల్‌మెట్, నాయుడు కాలనీ, సహారా హోమ్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా ఈదమ్మ బోనాలు



ఈదమ్మ ఆలయం వద్ద భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈదమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సోదరులు భారీ ర్యాలీగా అమ్మవారి తొట్టెలను ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ అనంతరం ఆదివారం రోజున ఈదమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఆలయానికి వచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేపట్టారు.

తబలా వాయిద్య పోటీలు



ప్రతిభకనబరిచిన అభ్యర్థులతో జయకిషన్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి చైతన్య విలాస్ కాలనీకి చెందిన చిన్మయి చేతన్ భార్గవ్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. ఆదివారం కూకట్‌పల్లిలో కృష్ణ సింధూరి సంకల్ప కళానిలయం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి శాస్త్రీయ వాయిద్యా సంగీత పోటీలు జరిగాయి. అన్నమాచార్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆచార్య టి.జయకిషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు జూనియర్స్ విభాగంలో సాయి కార్తీక్ ప్రథమ బహుమతి, చిన్మయి చేతన్ భార్గవ్ ప్రత్యేక బహుమతి, శ్రీహరి తృతీయ బహుమతి గెలుపొందగా వారిని జయకిషన్ అభినందించారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధి బృందావన్ కాలనీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కోవాకుల బాబు, నవారు మురళీధర్‌రెడ్డి, పాండుయాదవ్, రావుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సగరులను బీసీ-ఏలో చేర్చాలి

శంషాబాద్ రూరల్: సగర కులాన్ని బీసీ-ఏలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు శేఖర్ సాగర్ డిమాండ్ చేశారు. మండలంలోని గండిగూడ సమీపంలోని ఓ ఫాంహౌజ్‌లో ఆదివారం సగర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సగర సంఘానికి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తున్నా ఆశించిన స్థాయిలో లేదని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఐదు లక్షల జనాభా ఉన్న సగర జాతికి ఏ రాజకీయ పార్టీ అయినా సరే రెండు పార్లమెంట్ స్థానాలు, ఆరు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మరిన్ని పంచాయతీలకు సొంత భవనాలు

- ఎనిమిది భవనాలకు నిధులు మంజూరు
- ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయింపు
- సొంత భవనాలు లేక ఇన్నాళ్లు పడ్డ ఇబ్బందులకు చెక్
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఆయా ప్రాంతాల ప్రజలు



చౌదరిగూడలోని డ్వాక్రా భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

శంషాబాద్ రూరల్: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పంచాయతీలకు సొంత భవనాల సమకూరడం ఓ కలగా మారుతోంది. దశాబ్దాల నాటి నుంచి చిన్నపాటి భవనాలు, సామాజిక భవనాల్లోనే వీటి కార్యకలాపాలు కొనసాగుతున్న సందర్భాలు ఉన్నాయి. వీటికి తోడు నాలుగేళ్ల కిందట ఏర్పడిన కొత్త పంచాయతీలకు సైతం సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో ఒక్కో భవనం కోసం రూ.20 లక్షల చొప్పున మంజూరు అయ్యాయి.

కొత్త భవనాలు ఇక్కడే..

మండలంలోని చౌదరిగూడ, ఘాంసిమియాగూడ, కవ్వగూడ, మల్కారం, పెద్దషాపూర్‌తండా, పెద్దతూప్ర, పిల్లోనిగూడ, రషీద్‌గూడ పంచాయతీల భవనాలకు నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను కూడా గుర్తించారు. పనులను త్వరగా మొదలు పెడితే ప్రస్తుత పాలకవర్గం గడువు ముగిసేలోపు ఈ భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు గాను సర్పంచులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

గతంలో ఆరు భవనాలు..

జాతీయ ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు కొత్తగా ఆరు పంచాయతీలకు భవనాలు నిర్మించారు. పెద్దషాపూర్, ననాజీపూర్, మదన్‌పల్లి, రామంజాపూర్, పెద్దగోల్కొండ పంచాయతీ భవనాలకు రూ.16 లక్షల చొప్పున, సుల్తాన్‌పల్లి పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు వెచ్చించారు. కొన్ని చోట్ల ఈ నిధులు సరిపోకపోవడంతో దాతల సహకారంతో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. మదన్‌పల్లి మినహా మిగిలిన భవనాల పనులు పూర్తి చేశారు. పెద్దషాపూర్, ననాజీపూర్‌లో జీప్లస్‌వన్ నమూనాలో నిర్మించారు.

మేజర్ పంచాయతీలో అవస్థలు..

మండలంలో మేజర్ పంచాయతీల్లో పాల్మాకుల కూడా ఒకటి. ఇక్కడ ఇరుకు గదుల్లోనే పురాతన భవనంలో పంచాయతీ కార్యాలయం ఉండటం ఇబ్బందిగా మారింది. దీంతో సుమారు రెండేళ్ల నుంచి అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతుంది. నూతన భవనం నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరు కాగా.. వివిధ కారణాలతో పనులు చేపట్టలేదు. దీంతో అనుకూలమైన భవనం లేక కార్యకలాపాలు కొనసాగించడానికి అవస్థలు తప్పడంలేదు.

కొత్త పంచాయతీల్లో ఇదే పరిస్థితి..

కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు సొంత భవనాలు లేవు. కమ్యూనిటీ, అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అలీకోల్‌తండా, మదన్‌పల్లి పాత తండాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయలేదు.

నిధులు మంజూరు కావడం సంతోషకరం



కొత్తగా ఏర్పడిన చౌదరిగూడ పంచాయతీ సొంత భవనం కోసం రూ.20లక్షలు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు ధన్యవాదాలు. మా హయాంలోనే భవన నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తాం.

– కె.రాజ్‌కుమార్, సర్పంచ్, చౌదరిగూడ

పనులు ప్రారంభించాలి

కొత్తగా 8 గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు అయ్యాయి. అన్నింటికి స్థలాలను గుర్తించాం. త్వరలోనే పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– వసంతలక్ష్మి, ఎంపీడీఓ, శంషాబాద్.



నార్సింగిలో కల్యాణోత్సవంలో మల్లన్న, అమ్మవార్లు



పుప్పాలగూడలో మల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు

కనుల పండువగా మల్లన్న కల్యాణం

మణికొండ: ఒగ్గు కథలు, శివసత్తుల శిగాలు, పోతురాజుల విన్యాసాల నడుమ మల్లన్న కల్యాణోత్సవాలు కనుల పండుగగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజైన ఆదివారం ఘనంగా మల్లన్న కల్యాణోత్సవాలను ఆలయాల కమిటీ నాయకులు ఒగ్గు కళాకారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల నుంచి గంపలను ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అక్కడే బోనాలను సిద్ధం చేసి స్వామి వారికి సమర్పించారు. గణపతి హవనంతో మొదలైన ఉత్సవాలు సొడమ్మకు, మల్లన్న స్వామికి బోనాల సమర్పణ, అగ్నిగుండాలను తొక్కటం, మల్లన్న ఒగ్గు కథలతో కనుల పండువగా సాగింది. రెండు గ్రామాల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వార్లను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పుప్పాలగూడలో సోమవారం బీరప్ప కల్యాణం, బీరప్ప ఒగ్గు కథలు నిర్వహించనున్నారు. నార్సింగిలో నాగవల్లి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ నిర్వాహణ కర్త అశోక్‌యాదవ్ తెలిపారు.



పుప్పాలగూడలో మల్లన్న జాతరకు తరలివచ్చిన భక్తులు



గ్రామం నుంచి ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

వైభవంగా ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం



యాగశాలలో హోమాలు చేస్తున్న అర్చకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పంచవటి కాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహ సమేత శ్రీలలితా పరమేశ్వరీ సమేత శ్రీ కామేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. పూజల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం గురు ప్రార్థన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, గోపూజ, పంచగవ్య ప్రాశనం, దీక్షాధారణం, రక్షాబంధనం, అంకురార్పణ, సాయంత్రం 4 గంటల నుంచి యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, మండపారాధన, మహాగణపతి హోమం పూజలు నిర్వహించారు. కాగా ఈ నెల 26వ తేదీ వరకు జరిగే పూజల అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మొదటి రోజు పూజలకు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం సక్సెస్



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రామకృష్ణారెడ్డి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక వీఫర్‌యు స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్ అయ్యింది. ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చిన గుండె, కంటి, ఎముకలు, నరాలు, మహిళా సమస్యలు, దంత తదతర పరీక్షలు నిర్వహించుకుని మందులు తీసుకున్నారు. యశోదా ఆస్పత్రి డాక్టర్‌లు రోగులను పరీక్షించి అవసరమైన పరీక్షలు, మందులను అందజేశారు. మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి ప్రారంభించిన ఈ శిబిరంలో సంస్థ అధ్యక్షుడు బాపూజీ, ప్రధాన కార్యదర్శి డి.సీతారాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజం బాగుకు తమ వంతు కృషి చేద్దాం



అభయ ఫౌండేషన్ భారత్ సమ్మిట్‌లో వక్తలు

మణికొండ: తమకు ఉన్న దానిలో కొంత లేని వారికి ఇచ్చి సమాజం బాగుచేయాల్సిన బాధ్యత మనపై ఉందని గుజరాత్ వడోదరాకు చెందిన బీఏపీఎస్ డాక్టర్ జ్ఞానవత్సల్ స్వామిజీ అన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ఓం కన్వెన్షన్‌లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత్ సీఎస్ఆర్ సమ్మిట్-2023లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించినపుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, మనలో లీడర్‌షిప్, విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పెట్టుబడి దారులు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న వారికంటే.. లేని వారే ఎక్కువగా ఉన్నారని, వారిని ఉన్నత స్థితికి తేవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అదేవిధంగా ఈఎంఆర్ఐ మాజీ సీఈఓ వెంకట్ చంగవల్లి, ముంబై సెబీ సీజీఎం జీవన్‌లు కూడా పాల్గొని ప్రసంగించారు. సాయంత్రం అభయ ఫౌండేషన్ 16వ వార్షికోత్సవంలో సినీ నటుడు బ్రహ్మానందం, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వీసీ వీరభద్రుడు, ఎన్‌జీఓ సంస్థల ప్రతినిధులు, పాలసీ మేకర్స్, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహ్వానం



ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న దృశ్యం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ ఈవీవీ కాలనీలో నూతనంగా నిర్మించిన పంటమైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని స్థానిక నాయకులు చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని ఆదివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, సీనియర్ నాయకుడు ధన్‌రాజ్, బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మైలవరపు భవానీ సత్తా



మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకుంటున్న మైలవరపు భవానీ


బండ్లగూడ: నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్-2023లో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రాంతానికి చెందిన మైలవరపు భవానీకి నాలుగు మెడల్స్ దక్కాయి. మెదక్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో మైలవరపు భవానీ పాల్గొని 5000 మీటర్ల రన్‌లో సిల్వర్ మెడల్, 100 మీటర్ల రన్‌లో సిల్వర్ మెడల్, 1500 మీటర్ల రన్‌లో గోల్డ్ మెడల్, రిలే రన్‌లో గోల్డ్ మెడల్స్ సాధించింది. ఈ మేరకు నిర్వాహకులు ఆమెకు మెడల్స్ అందజేసి అభినందించారు.

మణికొండలో బాబాయ్ హోటల్ ప్రారంభం



బాబాయ్ హోటల్‌ను ప్రారంభోత్సవంలో సినీ హీరో నితిన్

మణికొండ: విజయవాడలో ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతూ ప్రఖ్యాతి గాంచిన బాబాయ్ హోటల్ హైదరాబాద్‌లోని మణికొండలో ఏర్పాటు చేయగా ఆదివారం సినీ హీరో నితిన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హడావుడి జీవితంలో భోజన ప్రియులకు చక్కటి భోజనాన్ని అందించేందుకు బాబాయ్ హోటల్ హైదరాబాద్ రావడం శుభపరిణామమన్నారు. సినీ డైరెక్టర్ శశికాంత్ తన స్నేహితులతో కలిసి ఫ్రెండ్స్ ఫ్యాక్టరీ అనే సంస్థను ఏర్పాటు చేసి దాని ఆధ్వర్యంలో బాబాయ్ హోటల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ వెంకీ కుడుముల, రామ జోగయ్యశాస్త్రి, రచయిత, దర్శకుడు వంశీ, నిర్మాత ఠాగూర్ మధు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, భాగస్వామి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెరవేరిన బస్సు కల



ఆర్టీసీ సిబ్బందికి స్వీట్లు అందిస్తున్న మాల్యాద్రినాయుడు

మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల వాసులకు సికింద్రాబాద్‌కు బస్సు సౌకర్యం కావాలనే కల ఎట్టకేలకు నెరవేరింది. మణికొండ మర్రిచెట్టు సర్కిల్ నుంచి బస్సులు ఉన్నా నార్సింగి రోడ్డు వైపు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారు. ఇదే విషయాన్ని ఇటీవల మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాల్యాద్రినాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు అధికారులకు తెలపడంతో నార్సింగి నుంచి మణికొండ, పుప్పాలగూడ, ఓయూ కాలనీ, ఫిల్మ్‌నగర్, జూబ్లిహిల్స్, అమీర్‌పేటల మీదుగా సికింద్రాబాద్‌కు 47 వై/ఎం బస్సులను ఆదివారం ప్రారంభించారు. దీంతో మాల్యాద్రినాయుడు మంత్రి, ఎంపీలకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఆర్టీసీ సిబ్బంది స్వీట్లు అందించారు. కార్యక్రమంలో పలు కాలనీల వాసులు యాదయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



నెక్నాంపూర్ చెరువును సందర్శించిన చేతన్‌సింగ్ సోలంకీ

మణికొండ: సహజ వనరులను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకుని శాశ్వత వనరులను భావి తరాలకు అందించాలని సోలార్‌మెన్ ఆఫ్ ఇండియా, ముంబై ఐఐటీ ప్రొఫెసర్ చేతన్‌సింగ్ సోలంకీ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ చిన్న చెరువు వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు, ఫ్లోటింగ్ ఏరాటర్స్, కంపోస్టింగ్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ధ్రువాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

శంషాబాద్ రూరల్: మండలంలోని జూకల్‌లో నిర్మిస్తున్న శ్రీభక్త ఆంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి స్థానికులు రూ.45 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం గ్రామానికి చెందిన ఏనుగు రాంచంద్రరెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు ఏనుగు కార్తీక్‌రెడ్డి, ఏనుగు వసంతమ్మ ఈ విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.నర్సమ్మ, ఉపసర్పంచ్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చే గువేరా కుమార్తె, మనవరాలికి ఘన స్వాగతం

శంషాబాద్: నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన క్యూబా సంఘీభావ సభకు హాజరయ్యేందుకు వచ్చిన విప్లవయోధుడు చే గువేరా కుమార్తె, మనవరాలికి శంషాబాద్ విమానాశ్రయంలో వామపక్షాల నేతలు ఘన స్వాగతం పలికారు. చే గువేరా కూతురు అలైదా గువేరా, ఆమె కుమార్తె ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరాలు కోల్‌కతా నుంచి ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి వారు ముక్దూం భవన్‌కు బయల్దేరి వెళ్లారు.

తెలంగాణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బీఆర్‌ఎస్‌లో చేరిన సులేమాన్‌నగర్ డివిజన్ మహిళా నాయకులతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్.

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ దేశానికే ఆదర్శంగా నిలుపుతున్న ఘనత సీఎం కేసీఆర్‌ది అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సులేమాన్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌస్‌భాయ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా దేశ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య భూమిక పోషించనుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముర్తుజా అలీ, ముజామిల్, రఫీక్, బాబర్, యూనిషా రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పరీక్ష



పరీక్షకు హాజరైన అభ్యర్థులు



పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తులో పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి సమీపంలో ఉన్న మహవీర్ ఇంజినీరింగ్ కళాశాలలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలకు 1912 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అదేవిధంగా 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పెండం మధు పర్యవేక్షణలో ఎస్సైలు రాములు, రాజశేఖర్‌రెడ్డి, రోహిత్, సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

అదుపుతప్పి ప్రమాదానికి గురైన కారు

- కారు నడిపిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు



డివైడర్ మధ్యలోకి దూసుకెళ్లిన కారు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలోని రెండో రోటరీ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున అతివేగంతో వెళ్తున్న కారు ఒక్కసారిగా డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను ఢీ కొట్టడంతో పాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను సైతం ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తి ఎయిర్‌పోర్టులో బంధువులకు వీడ్కోలు తెలిపి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కారు నడిపిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో 108లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రక్ష సెక్యూరిటీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం



నిఖిల్‌కుమార్

శంషాబాద్: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దేవ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏకే కాలనీలో నివాసముంటున్న కె.నిఖిల్‌కుమార్(16) చైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 20 కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో అన్ని చోట్ల వెతకగా ఆచూకీ లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.